క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజానగరం: కానవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఆ సమయంలో చక్రద్వారబంధం, రాధేయపాలెం, రాకీ ఎవెన్యూస్‌లకు విద్యుత్ ఉండదన్నారు.

ములకల్లంకలో నేడు మాక్ డ్రిల్

సీతానగరం: ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ములకల్లంక గ్రామంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్యం, పంచాయతీ, మహిళా, శిశు సంక్షేమ, ఎలక్ట్రికల్, ఇరిగేషన్, పశుసంవర్ధక శాఖ, విమానయాన విభాగం మొదలైన శాఖలకు సంబంధించిన సిబ్బంది హాజరవుతారన్నారు.

అక్రమంగా కలప తరలింపు

కోరుకొండ: మండలంలోని దోసకాయలపల్లి తదితర గ్రామాలకు చెందిన రాజకీయ నాయకులు కలపను రాత్రివేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు. సోమవారం రాత్రి మండలంలోని బూరుగుపూడి పాశాలమ్మగుడి, ఊరచెరువు మీదుగా తరలించినట్టు స్థానికులు వెల్లడించారు. ఏజెన్సీలోని డి.వెలమలకోట నుంచి టేకు, తదతర కలపను టాటా ఏసీ పెద్ద వ్యానులో తరలిస్తుండగా స్థానికులు ఆరా తీశారు. దానికి వాహన చోదకుడు కనీసం సమాధానమివ్వకుండా వేగంగా ముందుకు వెళ్లిపోయాడు. దీనిపైతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల చేరిక



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ఆరో తరగతిలో చేరిన విద్యార్థులు

సీతానగరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 273 మంది విద్యార్థులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పినట్టు ఎంఈవో కె.స్వామి నాయక్ సోమవారం తెలిపారు. అలాగే సీతానగరంలోని లంకూరు, లలిత నగర్, మావుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తి చేసుకున్న వారిని సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ఆరో తరగతిలో చేర్పామన్నారు.

పేకాట ఆడుతున్న 11 మంది అరెస్ట్

సీతానగరం: రఘుదేవపురం శివారున జరుగుతున్న పేకాట శిబిరంపై రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 11 మందిని అరెస్ట్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా, కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వాసంశెట్టి శ్రీను సోమవారం తెలిపారు. నిందితుల నుంచి రూ 37,860, ఏడు మోటారు సైకిళ్లు, ఒక కారు స్వాదీనం చేసుకున్నారన్నారు.

మరణాన్ని జయించిన ఏసుక్రీస్తు

కోరుకొండ: ఏసుక్రీస్తు మరణాన్ని జయించారని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మనోజ్ కుమార్ అన్నారు. బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ దేవుని కుమారుడైన క్రీస్తు మానవాళి పాపాల విముక్తి కోసమే పరలోకం నుంచి భువికి దిగి వచ్చారన్నారు. క్రైస్తవులు సహోదర ప్రేమను సమాజానికి పంచాలన్నారు. కార్యక్రమంలో ఉపదేవి కొల్లి జాకబ్‌రాజు, దూడపల్లి సుబ్బారావు, గెడ్డం రత్నం, జార్జి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మూడు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందాయి. అడంగళ్‌లో తప్పుగా నమోదైన పేరును సరిచేయాలని రఘుదేవపురానికి చెందిన డి.ధనలక్ష్మి, పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తి వివరాలపై ఇనుగంటివారిపేటకు చెందిన కుమార్, ప్రెస్ క్లబ్ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలి కోరుతూ స్వర్ణాంధ్ర ప్రెస్‌క్లబ్ సభ్యులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు భవ్యశ్రీ

ప్రకాశం నగర్: నెహ్రూ నగర్ మున్సిపల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కారుమూరి భవ్యశ్రీ ఫుట్ బాల్ అండర్ - 14 విభాగంలో జాతీయ పోటీలకు ఎంపికైంది. ఏప్రిల్ 25 నుంచి 30 వరకూ కొల్హాపూర్‌లో జరిగే జాతీయ పోటీలో తలపడుతుంది. కాగా.. జాతీయ పోటీలకు వెళుతున్న భవ్యశ్రీని సోమవారం జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అభినందించారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీవీ సత్యనారాయణ, వ్యాయామోపాధ్యాయురాలు జి.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం

- సమాచార హక్కు చట్టం ఒక వరం
- కేవలం రూ.పదితో సమాచారం
- నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు



రంగంపేటలో విచారణ చేస్తున్న అప్పిలేట్ అధికారి శ్రీనివాసరావు (ఫైల్)

రంగంపేట: మండలంలోని వడిశలేరు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక ప్రత్యేక పాఠశాల, సూర్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన సమాచారం కావాలని సమాచార హక్కు చట్టం కింద గతంలో ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సమాచారం ఇవ్వలేదు. దీంతో సదరు దరఖాస్తుదారుడు మొదటి అప్పీలుగా ఎంఈవోకు దాఖలు పర్చారు. సమాచారం ఇవ్వకుండా సమయాన్ని వృథా చేసినందుకు సీపీఏ రూల్స్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారుడు కోరాడు. దీనిపై ఎంఈవో శ్రీనివాసరావు సమాచార హక్కు చట్టం అప్పిలేట్ అధికారిగా విచారణ చేశారు. ఈ నెల 30వ తేదీలోపు పూర్తి సమాచారంతో కాపీలను సదరు దరఖాస్తుదారుడికి అందజేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు... ఇది సమాచార హక్కు చట్టానికి ఉన్న పవర్. ఇదే కాదు మరెన్నో సమస్యలకు పరిష్కారం చూపుతుంది. దీనిపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలి.

ప్రజలకు వరం

సమాచార హక్కు చట్టం ప్రజలకు ఓ వరం. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకోవడం కోసం ఎంతో మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతూ ఉంటారు. సమాచారం పొందడానికి ఓ చట్టం ఉందని ఇప్పటికీ ఎంతో మందికి తెలియకపోవడం శోచనీయం. ప్రభుత్వ పాలనకు సంబంధించి ప్రతి విషయం ప్రజలు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్) ఉంది. ప్రతి ఒక్కరూ ఈ యాక్టును సద్వినియోగం చేసుకోవచ్చు. కేవలం రూ.10తో దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి సమాచారం అయినా పొందే అవకాశం ఉంది. 2005లో సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ చట్టం ద్వారా పౌరులు అడిగిన సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ఈ అంశాలపై సమాచారం

ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా సంస్థల నుంచి సమాచారం అడిగి తెలుసుకునే అధికారాన్ని సమాచార హక్కు చట్టం కల్పిస్తోంది. ఈ చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా సమాచారం కోసం దరఖాస్తు చేసుకుని, కావాల్సిన వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం చేపట్టే పనుల వివరాలు, నిధుల విడుదల, వినియోగం ఇతరత్రా అంశాలను తెలుసుకోవచ్చు. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు ప్రజలకు కనిపించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా ఉంచకపోయినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంది.

ఫీజు వివరాలు

తెల్ల రేషన్ కార్డుదారులకు దరఖాస్తు రుసుం ఉచితం. గ్రామస్థాయి సమాచారానికి దరఖాస్తు రుసుం లేదు. మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 చెల్లించాల్సి ఉంటుంది. దీనిని డీడీ, చెక్కు, పోస్టల్ ఆర్డర్, నగదు రూపంలో ఇవ్వవచ్చు. సమాచారాన్ని ముద్రణ రూపంలో ఇవ్వడానికి అయ్యే ఖర్చును దరఖాస్తు చేసుకున్న వారు చెల్లించాలి. సాధారణంగా దరఖాస్తు ఫీజుతో పాటు ముద్రణ రూపంలో కోరితే పేజీకి రూ.2 చొప్పున జిరాక్స్ ఖర్చులు, సీడీ రూపంలో అయితే రూ.100 చెల్లించాలి. రికార్డుల పరిశీలన విషయంలో మొదటి గంటకు ఉచితం, తరువాత ప్రతి గంటకు రూ.5 చొప్పున చెల్లించాలి.

దరఖాస్తు విధానం

సమాచారం కావాల్సిన వారు సంబంధిత కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. తెల్ల కాగితంపై రాసి దరఖాస్తు చేసుకున్నా సరిపోతుంది. దీనిపై అవగాహన లేకపోతే పౌర సమాచార అధికారి సహాయం తీసుకోవచ్చు. కోర్టు పరిశీలనలో ఉన్న సమాచారం, కేబినెట్ సమావేశాలు, రికార్డులు, మంత్రులు వారి కార్యదర్శుల నిర్ణయాలు, వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించే సమాచారం ఇచ్చేందుకు నిరాకరించవచ్చు. అయితే అవి కూడా ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవి అయితే తప్పకుండా ఇవ్వాల్సి ఉంటుంది.

సమాచారం పొందే అంశాలు

ఆర్టీఐ చట్టం ద్వారా పత్రాలు, మెమోలు, రికార్డులు, పత్రికా ప్రకటనలపై అడగవచ్చు. అదే విధంగా ఉత్తర ప్రత్యుత్తరాలు, లాగ్ బుక్స్, ఒప్పందాలు, నివేదికలు, సమూనాలు, తనిఖీ, రికార్డులు మొదలైనవి ఉండవచ్చు. ఎలక్ట్రానిక్ రూపంలో కూడా ఉండవచ్చు. రేషన్ డీలర్ల రికార్డులు, అమ్మకాల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంచాయితీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి వార్షిక నిధులు, లబ్ధిదారుల వివరాలు, సీఎం సహాయ నిధి వివరాలు, ప్రజాప్రతినిధుల నియోజకవర్గ అభివృద్ధి నిధులు, వినియోగం తదితర వివరాలు కాగితాలు, అధికారులపై ఉన్న ఆరోపణల నేపథ్యంలో ఉన్న పలు అంశాల గురించి పేపర్ స్టేట్‌మెంట్, వీడియోల రూపంలోనూ పొందవచ్చు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమాచార హక్కుచట్టం 2005 ప్రకారం అర్జీదారులకు నిర్ణీత సమయంలో సమాధానం చెప్పాలి. లేకపోతే ఆ అధికారులపై చర్యలు తీసుకుంటారు. ఈ యాక్టును సామాన్యుడి చేతిలో వజ్రాయుధంగా చెప్పుకోవచ్చు. ప్రజలు ఈ చట్టంపై మరింత అవగాహన పెంచుకోవాలి.

– అయ్యంకి సురేష్‌బాబు, ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

గడువులోపు సమాచారం



చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న నిర్ణీత గడువు లోగా సమాచారం అందజేయాలి. ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం బోర్డులు ఉండాలి. రంగంపేట మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ బోర్డులు కనిపించడంలేదు. దరఖాస్తుదారు ఫిర్యాదు మేరకు కోర్టు చట్టరీత్యా చర్యలు తీసుకునే ఆస్కారం ఉంది. ఆర్టీఐ అనేది సామాన్యుడి చేతిలో ఒక అస్త్రం లాంటిది.

– కుందేటి వెంకట రమణ, ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్, వడిశలేరు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలోని కూనవరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతు సాధికారి సంస్థ మండల రీసోర్స్ పర్సన్ ఎం.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. దేశీ విత్తనాలైన బ్లాక్ రైస్, రత్నాచోడి, మైసూర్ మల్లిక వంటి వాటిని వివరించారు. అనంతరం పలువురు రైతులకు సన్మానించారు. అలాగే రైతులకు నవధాన్య విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సాధికారి సంస్థ కూనవరం యూనిట్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యదర్శిగా ధర్మారెడ్డి



పెదపూడి: ఢిల్లీకి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా సంస్థ జాతీయ సంయుక్త కార్యదర్శిగా అనపర్తికి చెందిన నల్లమిల్లి ధర్మారెడ్డి నియమితులయ్యారు. ఆయనకు జాతీయ అధ్యక్షుడు జ్యోతి శేఖర్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ విషయాన్ని ధర్మారెడ్డి సోమవారం ప్రకటనలో సోమవారం తెలిపారు. ధర్మారెడ్డి రైజింగ్ హాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడిగా 12 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



రాజానగరంలో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి



బిక్కవోలులో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం: ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చేర్పించి, వారికి బంగారు భవిష్యత్తు అందించాలని మండల విద్యాశాఖ అధికారులు రామన్నదొర, జ్యోతిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా రాజానగరంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన కొందరు విద్యార్థులను సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల కాలంలో వచ్చిన మార్పులను, బోధనాతీరును తల్లిదండ్రులకు వివరించారు. రాజానగరం, సూర్యారావుపేట, తూర్పుగానుగూడెం పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిక్కవోలులో..

బిక్కవోలు: తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయుడు జంగా ప్రసాద్ అన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంటిబాబు, అరుణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిల్లి నిర్మలకు పుత్రికా వియోగం

- అనారోగ్యంతో ఆమె కుమార్తె అమూల్య మృతి
- నివాళులర్పించిన ప్రముఖులు



తోట దేవీ అమూల్య (ఫైల్)



పిల్లి నిర్మలను ఓదార్చుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర ఖాదీబోర్డు మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకురాలు పిల్లి నిర్మల, తాతారావు దంపతుల కుమార్తె డాక్టర్ తోట దేవి అమూల్య (33) ఆదివారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. అమూల్య నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు తోట శివకుమార్ రెండో కుమారుడు డాక్టర్ స్మరణ్ భార్య. ఆమె రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో ఈఎన్‌టీ స్పెషలిస్టుగా విధులు నిర్వహిస్తూ ఇంటెన్షిప్ కోసం హైదరాబాద్ యశోద హాస్పిటల్స్‌లో వైద్య సేవలు అందిస్తోంది. విధి నిర్వహణలో భాగంగా ఒక కేసును చూస్తున్న సమయంలో ఆ ఇన్ఫెక్షన్ ఆమెకు సోకింది. ఆ సమయానికి గర్భవతి కావడంతో లంగ్స్ ఇన్‌ఫెక్షన్ కావడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఆమెకు ఆధునిక చికిత్సలు చేయించినప్పటికీ ఫలితం దక్కలేదు. కాగా.. అమూల్య పార్థివ దేహాన్ని సోమవారం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ సందర్శించి నివాళులర్పించారు. పిల్లి నిర్మల, తాతారావు, తోట శివకుమార్, తోట స్మరణ్‌లను పరామర్శించారు. అలాగే నగరంలోని ప్రముఖ వైద్యులు, వివిధపార్టీలకు చెందిన నాయకులు అమూల్య మృతదేహానికి నివాళులర్పించారు.

వీవోఏ అక్రమాలపై డ్వాక్రా సభ్యుల ఫిర్యాదు

నిడదవోలు రూరల్: రుణాలు కావాలంటే వీవోఏకు కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని పలువురు డ్వాక్రా సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నిడదవోలు మండలం గోపవరానికి చెందిన వీవోఏ ఎం.లలిత అక్రమాలపై అదే గ్రామానికి చెందిన డ్వాక్రా సభ్యులు ముప్పిడి దివ్య, బంగారమ్మ, రామలక్ష్మి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో గోపవరం పంచాయతీ కార్యాలయం వద్ద డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు స్త్రీనిధి జనరల్ మేనేజర్ ధర్మేంద్ర, ఉన్నతి పథకం డీపీఎం త్రిమూర్తులు, ఏపీఎం ఈదూరి మహాలక్ష్మి సోమవారం విచారణ చేపట్టారు. ఉన్నతి వడ్డీలేని రుణం రూ.50 వేలు తీసుకుంటే ఇప్పటికే రూ.2,500 చొప్పున 24 నెలలు చెల్లించినా ఇంకా బాకీ తీరలేదంటూ వీవోఏ లలిత ఇబ్బంది పెడుతోందని డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వాక్రా, స్త్రీనిధి రుణాలు కోసం కమీషన్లు ఇస్తేనే వీవోఏ బ్యాంకర్లతో మాట్లాడి మంజూరు చేయిస్తుందని ఫిర్యాదు చేశారు. ఉన్నతి రుణాలు ఎక్కువ చెల్లించిన సభ్యుల డబ్బులను వీవోఏ లలిత వద్ద రికవరీ చేయాలని కోరారు. డ్వాక్రా సభ్యుల అభిప్రాయాలను సేకరించి డీఆర్‌డీఏ పీడీకి నివేదిస్తామని అధికారులు తెలిపారు.

పూర్తిస్థాయిలో విద్యార్థుల బదలాయింపు



విద్యార్థుల ట్రాన్సిషన్ విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యా సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో క్లస్టర్ స్థాయిలో విద్యార్థుల ట్రాన్సిషన్ (విద్యార్థుల తరగతుల బదలాయింపు) పూర్తి స్థాయిలో జరగాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతిలో ఉన్న విద్యార్థి రెండో తరగతికి, రెండు నుంచి మూడవ తరగతికి.. అలా వారు చదివిన తరగతి నుంచి పైతరగతికి మార్పు చేసి, ప్రతిరోజు విద్యార్థుల రోలు వివరాలను కార్యాలయానికి అందజేయాలన్నారు. ఆయన సోమవారం ఉదయం బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ స్కూల్, కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల, నెహ్రూ నగర్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తరగతుల బదలాయింపు ప్రక్రియను పరిశీలించారు. స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్ స్థాయిలోని పాఠశాల పరిధిలో విద్యార్థులు ఆ కాంప్లెక్స్ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేరేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఏ ఒక్క విద్యార్థి మధ్యలో బడి మానివేయడానికి వీలులేదని, నూరు శాతం ట్రాన్సిషన్ జరగాలని ఆదేశించారు. ఆయన వెంట అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జేసీకి వినతి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

సీతానగరం: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడెల్లి ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుకు వినతపత్రం అందించారు. అనంతరం ప్రకాష్ మాట్లాడుతూ 2019 సంవత్సరం ఎఫ్‌టీఈ కల్పించిన ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలన్నారు. అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, రాజకీయ వేధింపులతో ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించి, కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. మాస్‌డేస్ విధానం రద్దు చేయాలని, మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలన్నారు.

బాధితులకు పరిహారం అందేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో బాధితులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత అన్నారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ సోమవారం వివిధ బ్యాంకింగ్ సంస్థలు, టెలిఫోన్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ పెండింగ్‌లోని ఆయా సంస్థల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి, ఆ జాబితాను జిల్లా న్యాయసేవాధికార సంస్థలకు అందజేయాలన్నారు. రాజీ పడదగిన అన్ని ఇతర కేసులను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆగని మట్టి దందా..

- చెలరేగిపోతున్న అక్రమార్కులు
- తమ పరిధి కాదంటూ అధికారుల అలసత్వం
- తరలిపోతున్న సహజ సంపద



కడియపులంక పరిధిలోని గోదావరి లంకలో అక్రమార్కులు తవ్వేసిన మట్టి (ఫైల్)

కడియం: ప్రభుత్వ శాఖల అధికారుల అలసత్వం కారణంగా గోదావరి లంక భూముల్లోని విలువైన మట్టి తరలిపోతోంది. ఆత్రేయపురం - కడియం మండలాల సరిహద్దుల్లో గోదావరి లంక భూముల్లోని మట్టిని అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వి సొమ్ములు చేసుకుంటున్నారు. పొట్టిలంక శివార్లలో జరుగుతున్న మట్టి దోపిడీని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చిన విషయం విదితమే. అయితే అది తమ పరిధిలోనిది కాదని కడియం రెవెన్యూ అధికారులు చేతులు దులిపేసుకున్నారు. ఆత్రేయపురం రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూడా సమాచారం తెలియజేసినట్లుగా ప్రకటన విడుదల చేసి నిమ్మకుండిపోయారు. అయితే రెండు రోజులుగా కడియపులంక పంచాయతీ పరిధిలోని గోదావరి లంక భూముల్లో మట్టి తవ్వకాలకు అక్రమార్కులు తెరలేపినట్లుగా స్థానిక రైతులు తెలిపారు. భారీ యంత్రాలను, లారీలను, ట్రాక్టర్లను మోహరించి గుట్టుచప్పుడు కాకుండా మట్టి తవ్వకాలు సాగిస్తున్నట్లుగా వివరిస్తున్నారు.

అలసత్వంతో బరితెగింపు

తమ పరిధి కాదంటే.. తమ పరిధిలోది కాదంటూ కడియం, ఆత్రేయపురం మండలాల రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో అక్రమ తవ్వకందారులు బరి తెగిస్తున్నారని లంక భూములను సాగు చేస్తున్న రైతులు వివరిస్తున్నారు. ఏ మండలం పరిధిలోనిది అయినప్పటికీ గ్రామ స్థాయిలో రెవెన్యూ సిబ్బందికి తెలియకుండా ఈ అక్రమ తవ్వకాలు సాగవని, అక్రమార్కులతో మిలాఖత్ కారణంగానే ఇలా అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఇలా చూసీచూడనట్లుగా వ్యవహరించి అక్రమార్కుల జేబులు నింపుతుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

మట్టి ఎంతో అవసరం

కడియం మండల వ్యాప్తంగా విస్తృతంగా ఉన్న నర్సరీలకు మట్టి అవసరం ఎంతో ఉంది. ఎక్కడెక్కడి నుంచో అధిక ధరలకు మట్టిని తీసుకువచ్చి రైతులు నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. ఒక వేళ గోదావరి లంకల్లో మట్టి తొలగించాల్సిందే అయితే.. ప్రభుత్వమే నేరుగా రైతులకు అందజేస్తే అటు నర్సరీలను కూడా ప్రోత్సహించినట్లు ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అక్రమార్కులు, వారికి సహకరించే అధికారులు జేబులు నింపుకొని నిబంధనలకు విరుద్ధంగా గోదావరి లంక మట్టిని కొల్లగొడుతున్నారన్నారు. ఇలా వారికి అవకాశం ఇచ్చే బదులు నర్సరీ రైతులకు నామమాత్రపు ధరకు అందజేస్తే నర్సరీలను ప్రోత్సహించినట్టు అవుతుందని చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు దీనిపై దృష్టిపెట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు ఏం చేస్తున్నారో..

అక్రమార్కులు మట్టిని తవ్వేసి తీసుకుపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. తమ పరిధిలోకి కాకపోయినా ప్రభుత్వానిదే కదా, పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉండదా?. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి.

– టి.అంజి, నర్సరీ రైతు

రైతులకు ఇవ్వండి

గోదావరి లంకల్లో వేస్తున్న మట్టి తొలగించేదే అయితే.. నర్సరీలను సాగు చేసే రైతులకు ఇస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రస్తుతం నలభై, యాభై కిలోమీటర్ల దూరం నుంచి మట్టిని వేల రూపాయలు వెచ్చించి తీసుకు రావాల్సి వస్తోంది. లంక మట్టి అయితే మొక్కలకు కూడా ఉపయోగమే. ఇలా అక్రమార్కుల పరంచేసే బదులు ప్రభుత్వానికి కూడా ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్. పవన్‌కుమార్, నర్సరీ రైతు